క్లుప్తంగా

ఎన్‌హెచ్ బాధితుల దీక్ష



మహబూబాబాద్: ఎన్‌హెచ్ 930పీ అలైన్‌మెంట్‌ను మార్చాలని బాధితులు సీతారాములు, వీరన్న లక్ష్మి, రాధ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం శివారు సాలార్ తండా సమీపంలో శుక్రవారం ఎన్‌హెచ్ బాధితులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మరో జాతీయ రహదారి నిర్మాణం సాలార్ తండా మధ్యలో నుంచి నిర్మాణం చేసేందుకు పూనుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నూతన కలెక్టరేట్ నిర్మాణం కోసం సాలార్ తండా వాసుల పేద గిరిజనుల భూములు లాక్కున్నారన్నారు. తండా ప్రక్క నుంచి రహదారి నిర్మాణం చేయాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యా, బుజ్జి, దమ్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థినులు

కేసముద్రం: హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 15, 16వ తేదీల్లో జరిగే 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని కల్వల మోడల్ స్కూల్ విద్యార్థినులు అజంతా, శ్రావణి, తేజశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రూపాస్, పీడీ లలిత శుక్రవారం తెలిపారు. సర్పంచ్ గంట సంజీవరెడ్డి, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రావు, కోచ్ ప్రేమ్‌కుమార్, సంజీవరావు, ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మహబూబాబాద్ అర్బన్: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులుగా పదోన్నతి పొందిన గడపురం వరద రాజులు మహబూబాబాద్ టీచర్స్ ఫ్రెండ్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ వెంపటి విజయ్ రాజు, కోశాధికారి కాసం శ్రీనివాస్, వెంకట్రాం నర్సయ్య, కాపర బోయిన శ్రీనివాస్, తల్లాడ శ్రీనివాస్, నరసింహచారి, ఉప్పల శ్రీనివాస్, బాబురావు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి



కేసముద్రం: జిల్లా కిసాన్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన బీరం గోపాల్‌రెడ్డి నియామకమైనట్లు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వెంకన్న శుక్రవారం తెలిపారు.

అభివృద్ధిని విస్మరించిన మంత్రి

తొర్రూరు: తొర్రూరు పెద్ద చెరువు అభివృద్ధిని మంత్రి దయాకర్‌రావు విస్మరించారని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సురేష్‌బాబు, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగాధరి సిద్దులు అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద బతుకమ్మలతో విద్యార్థి నాయకులు నిరసన తెలిపారు. తొర్రూరు పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తానని హామీనిచ్చిన మంత్రి దాన్ని అటకెక్కించాడన్నారు. కనీసం బతుకమ్మ విగ్రహం కూడా లేకపోవడం దారుణమన్నారు. మాలోతు శివ, అభయ్, రఘు, తిరుపతి పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడి మృతి



గార్ల: 20ఏళ్ల క్రితం భార్య వదిలిపెట్టి వెళ్లిపోవడంతో నాటి నుంచి ఒంటరిగా జీవిస్తూ అనారోగ్యానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం గార్లలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లలోని హనుమంతుడి గుడి బజారుకు చెందిన నల్లమాసు రాంబాబు(55) ను భార్య వదిలిపెట్టిన నాటి నుంచి కొన్నేళ్లపాటు కూలీ చేసుకొని జీవనం వెళ్లదీశాడు. 4 ఏళ్ల నుంచి పని చేసేందుకు అనారోగ్యం సహకరించకపోవడంతో తెలిసిన వారి వద్ద నగదు అడుక్కుంటూ ఇంతకాలం జీవనం కొనసాగించాడు. మృతుడికి ఇల్లు కూడా లేదు. వారం రోజుల నుంచి అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికులు కందునూరి శ్రీనివాసరావు, బాలాజీ మానవత్వంతో రాంబాబును గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తుండగా మృతిచెందాడు. స్థానికులు మృతుడి భార్యకు సమాచారం ఇచ్చారు. మృతదేహం ప్రస్తుతం సీహెచ్‌సీ ఆస్పత్రి బయట ఉంచారు.

వైభవంగా బతుకమ్మ సంబురాలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. రాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు వెంకటేశ్వర్లు, రామా రత్నమాల, అధ్యాపకులు మమత, యుగంధర్, వేణు గోపాల్, బొంద్యాలు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రకరకాల పూలు తెచ్చి బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు.

దంతాలపల్లి: మండలంలో కనుకదుర్గ, వినాయక కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన బొడ్డెమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో బతుకమ్మ, దసరా పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదే విధంగా విద్యార్థులు రావణాసురవధ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



డోర్నకల్: బ్రిలియంట్ పాఠశాలలో..



దంతాలపల్లి: బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు



కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్ లో రావణాసుర వధ నిర్వహిస్తున్న విద్యార్థులు

డోర్నకల్: మండల కేంద్రంలోని బ్రిలియంట్ హైస్కూల్‌లో విద్యార్థినులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కార్మికులకు 'కూలీబంధు' ప్రకటించాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి: భూమిలేని వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి ఎన్నికల మేనిఫెస్టోలో కూలీబంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సంఘం మండల రెండో మహాసభ తురక రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు పనిలేని రోజుల్లో పనికల్పించే ఉపాధి హామీ పథకానికి నిధులను కోత విధించడం మానుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.5వేల పింఛన్, రోజు కూలీ పనికి రూ.600 ఇవ్వాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కన్నె వెంకన్న, అధ్యక్షుడిగా బసవ కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అప్పాల వెంకన్నలతో ఏడుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు పోగుల శ్రీనివాస్, బుర్ర సమ్మయ్య, దూదికట్ల సారయ్య, నిలిగొండ నాగేశ్వర్ రావు, బూర్గుల కృష్ణ పాల్గొన్నారు.

'ఆశీర్వదించండి.. అండగా ఉంటా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

కురవి: రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని, అండగా ఉంటానని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. మంత్రి సత్యవతిరాథోడ్ ముఖ్య అనుచరులను కలిసి మద్దతు ఇవ్వాలని సూచించారు. అసంతృప్తిగా ఉన్న నాయకులను కలిసి బుజ్జగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్, బీజేపీలు ఏమి చేయలేవని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ ముండ్ల రమేష్, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, సొసైటీల చైర్మన్‌లు గార్లపాటి వెంకటరెడ్డి, కొండపల్లి శ్రీదేవి, సుధాకర్‌రెడ్డి, రాంచంద్రయ్య, బిక్షమయ్య, రమేష్, వెంకటరెడ్డి, కిషన్‌నాయక్, వెంకన్న పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డుతోపాటు పలువార్డుల్లో బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, మార్నేని వెంకన్న, గద్దె రవి, చిట్యాల జనార్దన్, గోగుల రాజు, యాళ్ల మురళీధర్ రెడ్డి, రావిష్, శంకర్, మహేందర్, కృష్ణ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. గుర్తు తెలియని కొంతమంది దుండగులు అర్ధరాత్రి ఆలయానికి చెందిన సెటర్లను తొలగించి 5 ఇత్తడి విగ్రహాలు, 1 ఇత్తడి పల్లకితోపాటు మొత్తం 135 కేజీల పాత ఇత్తడిని ఎత్తుకెళ్లారు. ఆలయ ఈఓ వేణు గోపాల్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ, ఎస్సై జగదీష్‌తోపాటు క్లూస్ టీం సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: కాంగ్రెస్ మండల కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దారావత్ బాలునాయక్, గోపాల వెంకట్‌రెడ్డి, ఎల్లాగౌడ్, కీర్తిసురేందర్, ఉపాధ్యక్షులుగా సారంగరెడ్డి, యాకయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు సారయ్య, చిన్నకొమురయ్య, లక్ష్మణ్, వీరస్వామి, సహాయ కార్యదర్శులు భూలోకరెడ్డి, శ్రీనివాస్, కుమార్, విజేందర్, కోశాధికారిగా చిదురాల వసంతరావు, ప్రచార కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, కత్తి స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడిని ఖండించాలి

మరిపెడ రూరల్: ఉపాధ్యాయుడిపై దాడిని ఖండించి, దాడికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.గోవర్ధన్, సీహెచ్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్‌కే.మహమ్మద్‌ను ఏ సంబంధం లేని రహీం అనే వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తి ఉపాధ్యాయుడిపై దౌర్జన్యానికి దిగాడన్నారు. మహమ్మద్ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడని చూడకుండా మండల కేంద్రంలోని ఎస్టీఓ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చుకెళ్లి అక్కడ పోలీసులకు అప్పగించాడన్నారు. అక్కడ పోలీస్‌స్టేషన్‌లోని సదరు హెడ్‌కానిస్టేబుల్ యాకుబ్ అనే వ్యక్తి ఎలాంటి ఫిర్యాదు స్వీకరించకుండానే క్షణికావేశానికి గురై మహమ్మద్‌ను కర్రతో ఇష్టం వచ్చినట్లు కొట్టాడని వారు ఆరోపించారు. అన్యాయంగా దాడి చేసిన హెడ్ కానిస్టేబుల్ యాకూబ్, రహీంలపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఇరువురిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి



మంత్రికి మద్దతు తెలుపుతున్న స్వర్ణకారులు

తొర్రూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం తొర్రూరు పట్టణంలోని సునార్ స్వర్ణకారుల సంఘం నాయకులు, కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లికి సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు దారం ప్రసాద్, గుర్తూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ ఆవుల సుజాత, గ్రామ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈదునూరి మధు, నాయకుడు రవికుమార్‌లు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆడపిల్లలను బతికించుకోవాలి



మాట్లాడుతున్న నాగవాణి

మహబూబాబాద్: నేటికి ఆడపిల్లలంటే చులకన ఉందని, కొంత మంది తల్లిదండ్రుల ఆడపిల్లలను వదిలించుకునే పని చేస్తున్నారని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ఒక కుటుంబం ఇప్పటికే వారికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, వాళ్లని పెంచడమే కష్టంగా ఉందని మళ్లీ ఆడప్లిల జన్మించిందని శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు అప్పగించారు. ఈసందర్భంగా సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి మాట్లాడుతూ.. ఆడపిల్ల అనే చులకన భావన మగపిల్లవాడు కావాలనే ఆలోచనతో ఇలా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆడపిల్లలు జన్మిస్తే ఎన్నో రకాల రాయితీలు కల్పిస్తున్నా ఇలాంటివి జరుగుతూనే ఉండటం బాధాకరమన్నారు. ఆడపిల్లలను బతికించుకుందాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం.. బతుకమ్మ సాక్షిగా ఆడపిల్లలను బతికించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ సభ్యుడు డాక్టర్ డేవిడ్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు.


ఆత్మగౌరవానికి కేరాఫ్ ముదిరాజ్‌లు



ముదిరాజ్‌లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: ఆత్మగౌరవానికి కేరాఫ్ ముదిరాజ్‌లని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. పల్లెపల్లెకు బీజేపీ ఇంటింటికి హుస్సేన్‌నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. మానుకోట నియోజకవర్గ గడ్డమీద కాషాయ జెండా ఎగరవేస్తామని, రానున్న ఎన్నికలలో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గోపాలపురానికి చెందిన 30కుటుంబాలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సిద్దార్థ రెడ్డి, జిల్లా కోశాధికారి శ్యామ్ సుందర్ శర్మ, నాయకులు రాము, ఉప్పాలయ్య, వెంకన్న, సాయి, శ్రీను, యాకాన్న, రోశాలు, దుర్గేశ్, వీరన్న, ఉప్పలయ్య, నవీన్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

రగ్బీతో ఉద్యోగ అవకాశాలు



రగ్బీ ఆడుతున్న క్రీడాకారులు

తొర్రూరు: రగ్బీ క్రీడతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో 67వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 17, 19 ఏళ్ల బాల, బాలికల విభాగంలో చేపట్టిన పోటీల్లో 10జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. జ్యోతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తుందని, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతుందన్నారు. రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చే విధంగా క్రీడల్లో రాణించాలని కోరారు. ప్రతిపల్లెల్లో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య, రాష్ట్ర పరిశీలకులు యూనస్‌ఖాన్, ప్రతినిధులు రమేష్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సునీల్, మాధవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ పథకాలు



గూడూరు: ప్రచారం చేస్తున్న రమేష్‌నాయక్

గూడూరు: కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యం అయిందని, బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగేందేమి లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండలంలోని దామరవంచలో శుక్రవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలను గడపగడపకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బీరం శ్రీపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు యాకయ్య, స్వామి, యాదగిరి, బాలూనాయక్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుపొంది అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చీకటాయపాలెం, గోపాలగిరి, గుర్తూరు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, సంతోష్, కుమార్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్, ప్రశాంతి, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలి

మహబూబాబాద్ రూరల్: ప్రజల మేలు కోరే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని పార్టీ మానుకోట అర్బన్ అధ్యక్షుడు అంజయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని 12వ, 13వ వార్డుల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ సభ్యులు చాంద్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పింద్రాల రాందాసు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దంతాలపల్లి: మండలంలో గల వివిధ గ్రామాలలో శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఎంపీడీఓ భారతి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, నీటిసౌకర్యం, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎంపీఓ అప్సర్‌పాషా, కార్యదర్శులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన తాపిమేస్త్రీ గడ్డం మురళీ ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈమేరకు ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆదేశాలతో, కేసముద్రం మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్ శుక్రవారం బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో స్వామి, రవి, చిన్న వెంకన్న, చక్రపాణి, శ్రీను పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోడి ఉమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం చీటిపాట సభ్యులు రూ.16వేల ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గార్ల: గార్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా నేడు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మహేంద్ర బాబు శుక్రవారం తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం

గార్ల: పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవంను శుక్రవారం మండలంలోని మద్దివంచలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి మహేష్‌కుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పృథ్వీరాజ్, చందు, చింటూ, సతీష్, మేఘన, సంజన, దీపిక పాల్గొన్నారు.

సీట్ల అమ్మకాలపై విచారణ చేపట్టాలి

కురవి: నల్లగొండ జిల్లాలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్లను అమ్ముకుంటున్న విషయంపై విచారణ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

దుర్గామాతకు పూజలు

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం దుర్గామాత ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి సర్పంచ్ దంపతులు నున్నా జయలక్ష్మి, జగన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, ఎంపీటీసీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

హమాలీల కూలిరేట్లు పెంచాలి

కేసముద్రం: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హమాలీల కూలిరేట్లను పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సెక్రటరీ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ మిల్‌వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బండి రాజు, జిలుకర బాబు, యాకుబ్‌పాషా, మంజుల, హేమ, నీల పాల్గొన్నారు.

మెజార్టీతో గెలిపించాలి

కేసముద్రం: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కుమారుడు సూర్యచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని ధన్నసరి గ్రామంలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణి, రవీందర్‌రెడ్డి, యాకుబ్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

గొర్రెలను పంపిణీ చేయాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వానికి డీడీలు చెల్లించిన వారికి, వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు చీర అశోక్, గౌరవ అధ్యక్షుడు ముదిగిరి సాంబయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడారు. గొర్రెల కోసం డీడీలు చెల్లించేందుకు అప్పులు చేయడంతోపాటు, భార్యల ఒంటిమీద పుస్తెలను తాకట్టు పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గొర్రెలను అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేర ముత్తయ్య, మండల అధ్యక్షుడు కుమారస్వామి, మొగిలి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

మరిపెడ రూరల్: పేదల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నీలికుర్తి సర్పంచ్ గుడిపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉమ్మడి నీలికుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని నేతవత తండాకు దర్గికి రూ.20 వేలు, నీలికుర్తికి చెందిన ఎస్.శంకర్‌కు రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ పంపిణీ చేశాడు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొండయ్య, ఉపసర్పంచ్ సురేష్, నాగన్న పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



మరిపెడ రూరల్: మండలంలోని సోమ్లతండా గ్రామ పంచాయతీ పరిధిలోని గుడుంబా స్థావరాలపై మరిపెడ పోలీసులు, తొర్రూరు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో 1500లీటర్ల నల్లబెల్లం పానకం ధ్వంసం చేసి, 50లీటర్ల నాటు సారా, 200 కేజీల నల్లబెల్లం, 40 కిలోల పటికను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మరిపెడ సీఐ లావుడ్య రాజు హెచ్చరించారు. ఈదాడుల్లో ఎస్సై దూలం పవన్, తొర్రూరు ఎక్సైజ్ పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపులో మద్యం పట్టివేత

డోర్నకల్: పట్టణ పరిధిలోని రాజుతండా శివారులో నిర్వహిస్తున్న బెల్టుషాపులో మద్యం సీసాలను పట్టుకున్నట్లు డోర్నకల్ ఎస్సై ఝాన్సీ తెలిపారు. శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ.. బెల్టుషాపులో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి రూ.5వేల విలువైన మద్యం సీసాలను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

దంతాలపల్లి: మండలంలోని వేములపల్లిలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మెగ్యా తండాకు చెందిన రజేందర్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ద్విచక్రవాహనంపై 24 బీర్లు తరలిస్తున్నాడు. బీర్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చందర్ తెలిపారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



నెల్లికుదురు: రైతులు సరైన మెళకువలు పాటించి పంటల సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించడం సాధ్యమని కేవీకే మల్యాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాలతీ రైతులకు సూచించారు. మండలంలోని ఆలేరు గ్రామంలో శుక్రవారం రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధిక సాంద్రత విధానంలో పత్తి, మిరప తదితర పంటల సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీనారాయణ, శాస్త్రవేత్తలు, కిశోర్, రాంబాబు, ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, ఉద్యాన అధికారి రాకేష్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.